గురువారం 3 ఆగస్టు 2017

# రైతు మోముల్లో సంతోషం



కౌతవరం లాకుల నుంచి బంటుమిల్లి కాల్వలోకి నీటి ప్రవాహం

## ❖ సగానికి పైగా సార్వా వరి నాట్లు
## ❖ గత దశాబ్దంలో ఇదే తొలిసారి
## ❖ పట్టిసీమతో సాధ్యం

**గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే**

డెల్టాలో సార్వా వరినాట్లు.. మే చివరలో నారు పోసి జూన్ రెండో వారంలో కాల్వలకు నీరు రాగానే నాట్లు ప్రారంభించి జులై చివరికి పూర్తి చేసేవారు. ఇది రైతు లెవర్ని కదిపినా చెప్పే మాట. కానీ గత పదేళ్లుగా ఈ లెక్క తప్పింది. కాలం సాగదీతకు గురైంది. తీవ్ర వర్షాభావంతో కాల్వలకు సక్రమంగా సకాలంలో నీరు రాని పరిస్థితి. దీంతో జులైలో వర్షాధారితంగా, బోర్ల కింద నారు పోసి ఆగస్టులో నాట్లు వేసేవారు. కొన్ని చోట్ల సెప్టెంబర్‌లో కూడా నాట్లు వేసిన గ్రామాలు రైతులు ఉన్నారు. గత నాలుగేళ్లుగా అయితే ఈ క్రమం తప్ప లేదు. దాదాపు దశాబ్దం తర్వాత ఈ ఏడాది డెల్టాలో జులై నాటికే సగానికి పైగా నాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుగా నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్ట్‌తో ఇది సాధ్యమైంది.

✦ మండలంలో మొత్తం 23,765 ఎకరాల సాగు భూమి ఉండగా, జులై 31 నాటికి 18,225 ఎకరాల్లో సార్వా వరినాట్లు పూర్తి చేశారు.

✦ గుడ్లవల్లేరు, కౌతవరం, అంగలూరు, కూరాడ, విన్నకోట, మామిడికోళ్ల, వెణుతురుమిల్లి, చంద్రాల, పెంజెంద్ర, చిత్రం, వడ్లమన్నాడు తదితర గ్రామాల్లో దాదాపు నాట్లు పూర్తయ్యాయి.

✦ దోకిపర్రు, చినగొన్నూరు, ఉలవలపూడి, గాదేపూడి, శేరికల్వపూడి, కుచికాయలపూడి, పోలిమెట్ల గ్రామాల్లోనే ఇంకా వేస్తున్నారు.



నాట్లు వేస్తున్న మహిళలు

✦ మండలంలో సాధారణ వర్షపాతం జూన్‌లో 101.1 మి.మీ ఉండగా 109.8, జులైలో 209.8కి 231.1 మి.మీ వర్షపాతం కురిసింది. దీనిపై మండల వ్యవసాయాధికారిణి నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడుతూ గత నాలుగైదేళ్లలో ఇలా జులై చివరనాటికే సార్వా వరి నాట్లు పూర్తికావడం ఎప్పుడూ లేదని, మరో వారం-పది రోజుల్లో మండలంలో మొత్తం సార్వా వరినాట్లు పూర్తి కానున్నాయని వివరించారు. దీనికి పట్టిసీమ గోదావరి నీరు ముందుగా రావడం, వర్షపాతం కారణమని వెల్లడించారు.

# గాంధీజీ నడయాడిన నేల

- గుర్తుగా గాంధీజీ, కస్తూరిబా మండప నిర్మాణం
- గ్రామంలో ఖద్దరు ఉత్పత్తి సంఘం ఏర్పాటు
- విదేశీ వస్త్రాల బహిష్కరణ

**కౌతవరం(గుడ్లవల్లేరు)** : స్వాతంత్ర్యోద్యమ సమయంలో కౌతవరం వాసులకు మహాత్మాగాంధీ ఉద్యమ ఊపిరులు ఊదేందుకు పండుగలా వచ్చారు. ఆయన నడయాడిన తీపి గుర్తుల్ని గ్రామస్తులు పదిల పరచుకున్నారు. గ్రామంలోని చేవెంద్ర రోడ్డు ఆరంభంలో నిర్మించిన గాంధీజీ, కస్తూరీబా మండపమే అందుకు నిదర్శనం. స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మాగాంధీ కౌతవరం వచ్చారు. ఉద్యమాన్ని నిర్వహించేందుకు స్త్రీలు తమ నగలు, పురుషులు డబ్బు మహాత్ముని చేతికి అందించి తమ దేశభక్తిని చాటుకున్నారు. గాంధీ వచ్చి వెళ్లినట్లుగా గాంధీజీ, ఆయన సతీమణి కస్తూరీబాకు దాతలు బొబ్బా ఈశ్వరరావు, బొబ్బా నాగేశ్వరరావు మందిరాన్ని నిర్మించారు. అప్పట్లో గ్రామస్తులు గాంధీజీ పిలుపును అందుకుని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఎన్నో త్యాగాలు చేశారు. కానూరి చిన వెంకటదానయ్య, బొబ్బా వీరభద్రయ్య, తాళ్లూరి శ్రీరాములు స్వాతంత్ర్య సమరంలో లాఠీ దెబ్బలు తిన్నారు. జైళ్లకు వెళ్లారు. విదేశీ వస్త్ర బహిష్కరణ చేశారని అంటున్నారు.



గాంధీ, కస్తూరాబా మందిరం

### కౌతవరంలో కళకళలాడిన చేనేత రంగం

సహాయ నిరాకరణ ఉద్యమానికి గాంధీజీ పిలుపు ఇచ్చిన రోజులవి. 1921లో విజయవాడ మహాసభకు హాజరైన బాపూజీకి కౌతవరం గ్రామస్తులు ప్రత్యేకంగా బట్టలను నేసి సమర్పించారు. 1930వరకూ కోపరేటివ్ బేసిస్ మీద ఖద్దరు ఉత్పత్తి సంఘం ఏర్పడి పని చేసింది. ఈ బేసిస్ కింద గ్రామంలో ఎనిమిది మగ్గాలు, 400రాట్నాల వరకు పని చేసేవి. అల్లాడివారి తోటలో 40కుటుంబాల వారు ప్రత్యేకంగా ఖద్దరు ఉత్పత్తులను తయారు చేసేవారు. అంతేగాక 1922లో తాళ్లూరి శ్రీరాములు రూ.6వేల తన సొంత మూలధనాన్ని వినియోగించి తన సొంత స్థలంలో ఖద్దరు ఉత్పత్తి రంగాన్ని చేపట్టారని స్థానికులు చెబుతున్నారు.

## స్వాతంత్ర్యోద్యమంలో లాఠీ దెబ్బలు



మా ప్రాంతంలో చాలామంది గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు. బ్రిటీషు పాలనను వ్యతికేరించి జైళ్లకు వెళ్లారు. ఆయన స్ఫూర్తితో గ్రామంలో చేనేత వస్త్రాల్ని నేశారు. విదేశీ వస్త్రాల్ని గ్రామంలో నిషేధించి చేనేత వస్త్రాలనే ధరించేవారు.

**- ప్రేమసాయి, యోగా గురువు**

## రెండు సార్లు వచ్చారు...



స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ రెండు సార్లు కౌతవరం వచ్చారు. ఒకసారి 1925లో వచ్చి భారీ సమావేశాన్ని గ్రామస్తులతో నిర్వహించారు. ఆ తర్వాత ఒక సారి పాదయాత్ర చేస్తూ వచ్చారు. ఆయన ఉద్యమానికి గ్రామస్తులు బాగా స్పందించి చందాలు భారీ మొత్తంలో సమర్పించారు.

**- దివి లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు**

## మా గ్రామానికి పండగే



మా గ్రామస్తులకు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పంచేందుకు వచ్చిన బాపూజీ జయంతిని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏటా పండుగలా జరుపుకుంటాం. దాతల సహకారంతో ఆయన పేరిట పార్కు నిర్మించాం. సతీ సమేతంగా ఆయన విగ్రహం గ్రామంలో శాంతి, సామరస్యాలను పెంపొందిస్తుంది.

**- పడమటి సుజాత, గ్రామ సర్పంచి**

సాక్షి Tue, 15 August 2017
epaper.sakshi.com//c/21369336











# రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే** : రైతుల సమస్య పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కౌతవరం కానూరి కల్యాణమండపంలో నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూశాఖ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అత్యధికంగా 139 మంది రైతులు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి, సర్పంచి పడమట సుజాత, తహశీల్దార్ మేరి, డీటీ కనకదుర్గ, భాజపా మండల అధ్యక్షుడు వడ్లమూడి రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

# వృద్ధురాలికి పింఛను

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే** : మండలంలోని కౌతవరానికి చెందిన వృద్ధురాలు బెజవాడ లక్ష్మీసౌభాగ్యానికి ఎన్టీఆర్ భరోసా పింఛను శుక్రవారం అందజేశారు. గత మూడు నెలలుగా ఆమెకు పింఛను రావడం లేదు. దీనిపై 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి పింఛను పంపిణీ చేశారు. ఆమె పేరుతోనే ఉన్న ఎవరో చనిపోవడంతో ఆమే చనిపోయినట్లు ఆన్‌లైన్ జాబితాలో పేరు తొలగించారు. దీంతో మూడు నెలలుగా ఆమెకు పింఛను నగదు నిలిచిపోయింది. దీనిపై 'ఈనాడు'లో గత నెలాఖరులో 'నేను బతికే ఉన్నా బాబూ' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆమె పేరును జాబితాలో చేర్చడంతో పింఛను మంజూరైంది. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలో ఆమెకు కార్యాలయ పర్యవేక్షకుడు తోట ప్రసాద్ నగదు అందజేశారు.



పింఛను అందుకుంటున్న లక్ష్మీసౌభాగ్యం

సోమవారం 28 ఆగస్టు 2017

# మూడు కాల్వలకు నీరు

## నెల తర్వాత వారాబందీ నిలుపుదల



బంటుమిల్లి కాల్వకు నీటి సరఫరాకు షట్టర్లు ఎత్తుతున్న లస్కర్లు, పక్కన సూపరింటెండెంట్ ఉదయభాస్కర్

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం ప్రధాన లాకుల నుంచి ఆదివారం మూడు కాల్వలకు నీటిని విడుదల చేశారు. నెల రోజుల తర్వాత వారాబందీని నిలిపేసి మూడు కాల్వలకు నీరు ఇవ్వడం గమనార్హం. జులై 26 నుంచి కౌతవరం లాకుల వద్ద వారాబందీ విధానం అమలు చేపట్టారు. నీటి ఎద్దడి నేపథ్యంలో బంటుమిల్లి, పోల్‌రాజ్, క్యాంప్‌బెల్ కాల్వలకు వారాబందీని అమలు చేస్తున్నారు. ఆదివారం పుల్లేరుకు పెద్దఎత్తున నీరు రావడంతో వారాబందీని తాత్కాలికంగా నిలిపేసి నీటిని విడుదల చేశారు. కౌతవరం లాకుల నుంచి పోల్‌రాజ్‌కు 570, క్యాంప్‌బెల్‌కు 455, బంటుమిల్లి కాల్వకు 170 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేసినట్లు లాకు సూపరింటెండెంట్ ఉదయభాస్కర్ వెల్లడించారు.